క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నీలగిరి మున్సిపాలిటీలో 11కేవీ లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దారుపాషకాలనీ, భారత్‌గ్యాస్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, శంస్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

12 మంది మున్సిపల్ ఉద్యోగులు బదిలీ

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా నీలగిరి మున్సిపల్ కార్యాలయం నుంచి 12 మంది ఉద్యోగులు వివిధ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా వివిధ మున్సిపాలిటీల నుంచి నీలగిరి మున్సిపాలిటీకి 11 మందిని బదిలీ చేసింది. వీరిలో 8 మంది రిపోర్ట్ చేశారు. మిగతావారు రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

సుంకెనపల్లి మాజీ సర్పంచ్ జంగమ్మ మృతి



చిట్యాల: మండలంలోని సుంకెనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆవుల జంగమ్మ (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. జంగమ్మ అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. జంగమ్మ మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆవుల యాదయ్య సంతాపం తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు..

కనగల్ : మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం(మిర్యాల) రాములు(70) మంగళవారం మృతిచెందాడు. రాములు మృతదేహాన్ని మాజీ జెడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవురేశి లింగయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, దేప నరేందర్ రెడ్డి, చిలకరాజు వెంకన్న, గోగు యాదయ్య, అనుముల శీను తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

నాంపల్లి : నాంపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దయాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు దాచపల్లి నర్సింహ, గిరిబాబు, శ్రీశైలం, శ్రీకాంత్, కోటేష్, శివగౌడ్, సాంబశివ, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

మునుగోడు: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఓబీసీ నాయకులు తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి, మాదగోని నరేందర్‌గౌడ్, మొగుదాల లింగస్వామి గౌడ్, అక్కెనపల్లి సతీష్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

జయరాజ్‌కు పరామర్శ

నకిరేకల్ : అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రజా గాయకుడు జయరాజ్‌ను మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని జి.యడవల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి రొయ్య వెంకన్న సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. వెంకన్న నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో మంగళవారం అంత్యక్రియలకు తోటి స్నేహితులు రూ.6000 నగదు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో గడ్డం కొండల్, బొల్లం లింగయ్య తదితరులున్నారు.

బంగారుగడ్డలో..

చండూరు : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన చండూరు మండలం బంగారుగడ్డ గ్రామానికి చెందిన నలపరాజు చిన్నలింగయ్య కుటుంబాన్ని మంగళవారం సీపీఐ నాయకులు పరామర్శించి రూ.22,500 ఆర్థికసాయం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, పల్లె యాదయ్య, బోయపల్లి భిక్షమయ్య, కర్నాటి వెంకటేశం, పల్లె నర్సింహ, జక్కలి పరమేష్, తలారి ముత్తయ్య, కాటపల్లి శ్రీను, లింగం, రమేష్, సాయికుమార్, దశరథ, శివ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మునుగోడు: సింగారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆ గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఆ పాఠశాల హెచ్ఎం ధనభార్గవి, ఉపాధ్యాయులు కృపమ్మ, రవీందర్‌రెడ్డి, నాగేశ్వరావు, విజయభాస్కర్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ కోక శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం

- మొదటగా ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కొనసాగే కేంద్రాలకు ప్రాధాన్యం
- మునుగోడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 77 కేంద్రాలకు అనుమతి
- యూనిఫాం కుట్టే బాధ్యత మహిళా సంఘాల సభ్యులకు
- ఇప్పటికే క్లాత్ సరఫరా చేసిన అధికారులు



కల్వకుంట్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వం అందించనున్న యూనిఫాం నమూనా

మునుగోడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనభ్యసించే చిన్నారులకు యూనిఫాం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మొదట ప్రభుత్వ పాఠశాలల ఆవరణంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రమే ప్రయోగాత్మకంగా యూనిఫాం అందించనున్నారు. యూనిఫాం కుట్టే బాధ్యతను జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అప్పగించింది.

ఏపీఎంలకు క్లాత్‌లు అందించిన అధికారులు..

స్వయం సహాయక సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంలు స్వయం సహాయక సంఘాల సభ్యులతో కుట్టించారు. అదే విధంగా అంగన్‌వాడీ చిన్నారులకు అందించే యూనిఫాం కుట్టేందుకు అవసరమైన క్లాత్‌లను ఐకేపీ ఏపీఎంల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. బాలికలకు ఫ్రాక్, బాలురకు నిక్కరు, చొక్కా కుట్టించి ఇవ్వనున్నారు. బాలురకు ఒక జతకు రూ.80, బాలికల ఫ్రాక్‌కు రూ.60 చొప్పున ఇవ్వనున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్లాత్‌లు అందజేశారు.

మొత్తం కేంద్రాలు 169..

మునుగోడు ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాల్లో మొత్తం 169 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2110 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో బాలురు 1074 మంది, బాలికలు 1027 మంది ఉన్నారు. అయితే అందులో 77 కేంద్రాలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్నాయి. మునుగోడు మండలంలోని 31 కేంద్రాల్లో 359 మంది చిన్నారులకు, చండూరు మండలంలో 14 కేంద్రాల్లో 130 మంది, చిట్యాల మండలంలో 32 కేంద్రాల్లో 514 మంది చిన్నారులకు యూనిఫాం అందజేయనున్నారు.

క్లాత్ అందజేశాం



ప్రభుత్వ పాఠశాలల ఆవరణంలో కొనసాగుతున్న మొత్తం 77 కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాం కుట్టించేందుకు అవసరమైన క్లాత్‌లను ఇటీవలే ఏపీఎంలకు అందజేశాం. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే చిన్నారులకు ఇచ్చే యూనిఫాం కుడుతున్నారు. అతి త్వరలో అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం అందజేస్తాం. మిగిలిన కేంద్రాల్లోని చిన్నారులకు ప్రభుత్వం ఎప్పుడు ఉత్తర్వులు జారీచేస్తే అప్పుడు కుట్టిస్తాం. మొదటి దఫా మాత్రం ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కొనసాగే అంగన్‌వాడీ చిన్నారులకు అందజేస్తాం.

–కవిత, సీడీపీఓ, మునుగోడు ప్రాజెక్టు

బడ్జెట్ వాయిస్

అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది



నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేవిధంగా ఉంది. గ్రామీణ, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పర్యాటకం, ఇందన భద్రత, నీటిపారుదల, వ్యవసాయం ఉపాధి, మహిళలు, యువత సాధికారత కోసం బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు.

– నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రాజెక్టులకు తీవ్ర అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు అన్యాయం జరిగింది. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి. వ్యవసాయ రంగానికి సరైన కేటాయింపులు చేయకపోవడం అన్యాయం.

–నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్య, వైద్యానికి ప్రాధాన్యత లేదు



నకిరేకల్ : చిన్న మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు, విద్య, వైద్యానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపరిచే ప్రణాళికలేవి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. దేశంలో ఉన్న అసమానతలను పరిష్కరించే ప్రయత్నం కేంద్ర బడ్జెట్‌లో చేయలేదు.

– టి. నర్సింహమూర్తి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి, నకిరేకల్

ఉపాధి హామీ నిధుల్లో కోత విధించింది



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధుల్లో కోత విధించింది. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించలేదు. రైల్వే లైన్ల విస్తరణకు కూడా కేటాయింపులు చేయకుండా అన్యాయం చేసింది. నిత్యావసర ధరలు నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి.

–ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

స్మితా సబర్వాల్‌పై పోలీసులకు ఫిర్యాదు



చిట్యాల : ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

చిట్యాల: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వీహెచ్‌పీఎస్(వికలాంగుల హక్కుల పోరాట సమితి) నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులను కించపరిస్తే ఆర్‌పీడబ్ల్యూ యాక్ట్–2016 ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో తుమ్మల లక్ష్మారెడ్డి, సామ రవీందర్ రెడ్డి, అంతటి రవీందర్, మేకల అంజన్‌కుమార్ గౌడ్, పాకాల సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా బీఎస్పీ

కట్టంగూర్ : దివ్యాంగులకు బహుజన్ సమాజ్ పార్టీ అండగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కత్తుల కాన్షీరామ్ అన్నారు. మంగళవారం కట్టంగూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులకు అఖిల భారత సర్వీసుల్లో రిజరేషన్లు అవసరమా.. అని ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అత్యున్నత పదవిలో ఉన్న ఐఏఎస్ అధికారి దివ్యాంగుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడడం దారుణమన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించాల్సి పోయి అవమానకరంగా మాట్లాడడం సరికాదన్నారు. ఐఏఎస్ అధికారి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులను అవహేళన చేయడం సరికాదు

నల్లగొండ టూటౌన్: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులను అవహేళన చేసేవిధంగా మాట్లాడడం సరైనది కాదని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్మితా సబర్వాల్ పై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



చిట్యాల: విద్యార్థులకు అక్షరమాల చార్టులు అందజేస్తున్న మేడి హరికృష్ణ

చిట్యాల: స్వాతంత్య్ర సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా మండలంలోని వట్టిమర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అక్షరమాల చార్టులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జానకి, ఉపాధ్యాయులు సరస్వతి, భారతి, విమల, పవన్ పాల్గొన్నారు.

కనగల్ : న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్య్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను కనగల్ క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ శివలీల, సింగం రవి, భిక్షాల నాగరాజు, కరుణాకర్ రెడ్డి, జయమ్మ, కడారి ముత్తమ్మ, రొయ్య ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనాలు పెంచుతామని, అర్హత కలిగిన వారిని రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని అన్నారు. ఆ హామీల అమలుకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటన చేయాలని కోరారు. పోతెపాక వినోద్‌కుమార్, పెంజర్ల సైదులు, పోలె సత్యనారాయణ, ఎస్. నర్సింహ, ఆశీర్వాదం, సర్వయ్య, మంద ఎల్లయ్య, కోటయ్య, ప్రభాకర్, సైదులు, యాదమ్మ, నరేష్, స్వప్న, యాదయ్య, సుధాకర్, రామలింగయ్య, నర్సయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షాలకే రోడ్లన్నీ గుంతలమయం



ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో గుంతలమయమైన రోడ్డు

పానగల్: మోస్తరు వర్షాలకే నల్లగొండ పట్టణంలోని పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు వెళ్లే రహదారిపై గోతుల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. గుంతలు పూడ్చి వర్షపు నీరు నిలువకుండా చేయాలని సంబంధిత అధికారులను ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శాలిగౌరారం: విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామంలోని రైతు శేష భట్టర్ నర్సిహాచార్యులకు చెందిన గేదె వ్యవసాయ బావి సమీపంలో మేత మేస్తుండగా అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగను గేదె తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

నేటి నుంచి వైద్యశిబిరం

కనగల్ : మండల కేంద్రంలోని తపస్వి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఆగస్టు 15వరకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా షుగర్, బీపీ పరీక్షలతోపాటు ఉచితంగా ఓపీ చూడనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి సత్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా రక్త పరీక్షలపై 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మునుగోడు: మండలంలోని గంగోరిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ సమకూర్చిన నోట్ పుస్తకాలతోపాటు బ్యాగులు, పెన్నులను మంగళవారం వివిధ సంఘాల నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్‌గౌడ్, కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి, వీరమళ్ల కార్తిక్ గౌడ్, కొప్పు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం



తిప్పర్తి కేజీబీవీ సిబ్బందితో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానన్నారు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు త్వరలోనే బదిలీలు చేపట్టేవిధంగా సంఘం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, సుంకరి భిక్షంగౌడ్, మేకల జానారెడ్డి, మహేందర్ రెడ్డి, నాగభూషణాచారి, తరాల జగదీష్, నర్సింహనాయక్ పాల్గొన్నారు.

నకిరేకల్: ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్షురాలు కడారి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, మధు, నర్సయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

మర్రిగూడ : పత్తి పంట యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారులతోపాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఏఓ హేమలత ఏఈఓలు విజయ్‌కుమార్, శ్రీలత, పావని, సుజాత, ప్రియాంక, జ్యోతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల పరిశీలన

మర్రిగూడ : జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లతోపాటు కేజీబీవీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఇస్కిళ్ల మహేందర్, సభ్యులు ప్రవీణ్, అన్నెపాక అనిల్, వెంకటేష్, కిరణ్, హనుమంతు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల సందడి



బోనాలతో వస్తున్న మహిళలు

కనగల్ : భక్తులపాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు.

'ఎంఎస్ఆర్' సేవలు అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మర్రి నర్సిరెడ్డి (ఎంఎస్ఆర్) స్మారక ట్రస్ట్ సేవలు అభినందనీయమని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో అమరవీరుల 25వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, మర్రి నర్సిరెడ్డి(ఎంఎస్ఆర్) స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని చంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామస్తులకు వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ మర్రి వసంతనర్సిరెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఏ.పుల్లారావు, నాయకులు దోనూరి నర్సిరెడ్డి, సుర్కంటి శ్రీనివాసరెడ్డి, దొంతగాని పెద్దులు, సీనియర్ జర్నలిస్టు మర్రి మహేందర్‌రెడ్డి, మర్రి మనోహర్‌రెడ్డి, ఐతరాజు గాలయ్య, వర్కాల చంద్రశేఖర్, దొంతగాని అమరేందర్, నడికుడి నరసింహ, కొత్త శ్రీకాంత్, పిట్ట రామచంద్రం, వంగూరి సాయికిరణ్, శివసెట్టి లాలయ్య తదితరులున్నారు.

మంగళపల్లిని కమ్మేసిన విషజ్వరాలు

- ఇంటింటా బాధితులే
- గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు

ఈ ఫొటోలో కనిపిస్తోంది నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మేడి లింగయ్య. ఇతను రెండు రోజుల క్రితం జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో మంచమెక్కాడు. మంగళవారం గ్రామంలో వైద్యసిబ్బంది ఇచ్చిన మందులు వేసుకుంటున్నానని చెబుతున్నాడు. లింగయ్య లాగానే రెండు ఎస్సీ కాలనీలతోపాటు గ్రామంలోని పలు కాలనీల్లో పలువురు జ్వరం, ఒళ్లు, కాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.



నకిరేకల్ :వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు ఇళ్లలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందడంతో మండలంలోని మంగళపల్లి గ్రామ ప్రజలు విషజ్వరాలతో సతమతమవుతున్నారు. మంగళపల్లిలో ప్రజలు ఇంటింటా విషజ్వరాల బారిన పడి మంచానికి పరిమితం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరాల బారిన పడిన ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు.

నీరు నిల్వ ఉండడం వల్లే..

మంగళపల్లి గ్రామంలో మొత్తం జనాభా 2810 మంది, మొత్తం కుటుంబాలు 630 ఉన్నాయి. వీరిలో రెండు కాలనీల్లో ఎస్సీ ప్రజలు ప్రతి ఇంట్లో ఇద్దరు నుంచి ముగ్గురికి పైనే జ్వరాల బారినపడ్డారు. ఈ రెండు కాలనీలతోపాటు ఇతర కాలనీల్లో కూడా ఇంటికి ఒకరిద్దరికి చొప్పున విషజ్వరాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకోగానే జ్వరాలు, ఒళ్లు, కీళ్ల నొప్పులు అంటూ మంచమెక్కుతున్నారు. గ్రామంలో మెజార్టీ వీధుల్లో సీసీ రోడ్లు ఉన్నప్పటికీ వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో కాలనీల్లో రోడ్ల పక్కన వర్షపు నీరు నిలిచింది. దీంతోపాటు ప్రతి ఇంట్లో వివిధ చోట్ల వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వాటి వల్లే విషజర్వాలు ప్రబలుతున్నాయని జిల్లా వైద్యాధికారులకు ప్రాథమికంగా గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది అన్ని వీధుల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. మురుగు ప్రదేశాల్లో బైటాక్స్ మందు పిచికారి చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ప్రత్యేక శిబిరం ఏర్పాటు

మంగళపల్లి గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కల్యాణచక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి దుర్గయ్య, మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్‌లు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ఓ ఇంట్లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ల్యాబ్ టెక్నీషియన్‌ను రప్పించి రక్తపరీక్షలు చేయిస్తున్నారు. 8 మంది నుంచి రక్త నమూనాలు తీసుకుని హైదరాబాద్ ఐపీఎం ల్యాబ్‌కు పంపించారు. టీమ్‌కు నలుగురు చొప్పున మొత్తం నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. గ్రామాన్ని నాలుగు విభాగాలు చేసుకుని ఒక్కో టీం 30 ఇళ్ల చొప్పున విషజ్వరాలపై సర్వే చేస్తున్నారు. ఇళ్లలో వాష్ ఏరియా, నల్లా గుంతలు, వాటర్ ట్యాంకులు ఉన్న ప్రాంతాల్లో నీటి నిలవ్వలను పరిశీలిస్తూ సర్వే చేస్తున్నారు. నీటి నిల్వ శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఇంట్లో ఎంత మంది ఉన్నారు.. ఎందరు జ్వరాల బారిన పడ్డారు అనే విషయాలను నమోదు చేస్తున్నారు.

కాల్వల్లో పూడిక తొలగించాం



గ్రామంలోని అన్ని వీధుల్లో ఉన్న మురుగు కాలవ్వల్లో పూడిక తొలగించాం. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బైటాక్ మందు పిచికారీ చేయించాం. బ్లీచింగ్ పౌడర్ చల్లించాం. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల వాటిలో దోమలు వృద్ధి చెంది జ్వరాలకు కారణమని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

–కట్ట రవీందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ, మంగళపల్లి



మంగళపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



వైద్యశిబిరానికి వస్తున్న జ్వర బాధితుడు



మంగళపల్లి ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో నిల్వ ఉన్న నీరు